కథ

# కనువిప్పు

– జి. రామలక్ష్మి

**సత్యం ఆఫీసు నుంచి కాస్త ఆలస్యంగా వచ్చాడు. అయినా జానకి చిరునవ్వుతో ఎదురొచ్చి, "వచ్చారా, రండి, వేడి వేడి కాఫీ పట్టుకొచ్చి ఇస్తాను. అలా కూర్చోండి" అంటూ లోపలికి పరుగులాంటి నడకతో వెళ్ళింది.**

సత్యం సోఫాలో కూర్చున్నాడు. జానకి కాఫీ ఓ చేత్తో అందిస్తూ, మరో చేత్తో అతను అందిచ్చే జీతం అందుకుంటుంటే సత్యంకి ఓ గంట క్రితం తన ఫ్రెండింటిలో చూసిన దృశ్యం, ఆ సంభాషణలు గుర్తుకొచ్చాయి.

సురేష్, తను కూర్చుని వుండగా అతని భార్య రేవతి ఆఫీసు నుంచి వస్తూనే–

"ఇదిగోండి జీతం. నాలుగు వేలు. దగ్గరుంచుకోండి".

"నాకెందుకోయ్ ఇలా ప్రతి నెలా ఇస్తావ్! బీరువాలో ఉంచరాదా?"

"ఉహు! మీకందిస్తేనే నాకు ఆనందం తృప్తి" అంటూ ఆమె ఇచ్చిన జీతాన్ని అతను పుచ్చుకుని జేబులో వుంచుకున్న సీను తనకెంతో వచ్చింది.

'హు! ఈవిడగారిచ్చేది కాఫీ నీళ్ళు. అందుకునేది నా జీతం ఐదు వేలు. నా రాత ఇంతే!" అనుకుంటూ కాఫీ తాగటం పూర్తి చేశాడు. జానకి అదేం పట్టించుకోలేదు.

భర్తతో ఆ రాత్రి పడగ్గదిలో జానకి "ఈ నెలతో మన 50 వేల చీటీలు రెండూ పూర్తయ్యి అక్షరాలా లక్ష రూపాయిలు అందుకుంటాం" అంది ఆనందంగా.

ఆమె పొదుపునీ, తెలివినీ, ఆదాతనాన్నీ, వున్నంతలో వున్నంత ఖర్చులకే కాక పొదుపు విషయంలో జాగ్రత్తపడుతూ ఈ నాలుగేళ్ళలో రెండు చీటీలు నడిపించి లక్ష రూపాయిలు అందిస్తున్నందుకు భర్త తనని ఎంతగానో అభినందిస్తాడని, పొగుడుతాడని, ఇంత మంచి భార్య దొరికినందుకు సంతోషిస్తున్నా, నని అంటాడని ఆశపడింది. కానీ అలా జరగలేదు సరికదా, అతను పెదవి విరుస్తూ నిష్ఠూరంగా–

"నా డబ్బు నాకు మిగిల్చి ఇవ్వడం గొప్పకాదు. నీవూ ఎంతో కొంత సంపాదించి నాతో సహకరిస్తే అది నాకు ఆనందం" అంటూ ఇందాక తన ఫ్రెండింట్లో జరిగింది, చూసింది చెప్పాడు.

జానకి మూతి ముడుచుకుపోయింది. అయినా అతనికి సమాధానంగా–

"నా వల్ల మీకెలాంటి లోటూ లేదు. అన్నీ నేనే చూసుకుంటున్నాను. ఆఖరికి ఇద్దరి పిల్లల చదువులు, బాధ్యతలు, పెంపకం, అన్నీ నేనే చూసుకుంటున్నాను. మీరు సంపాదించటం తప్ప మీకేం నాలా పనులు, ఒత్తిడి, బాధ్యతలు లేవుగా! పైగా ఉన్నంతలో వున్నంత పొదుపు చేసి మిగులుస్తున్నాను కదా!" అంది.

"ఆ పనులన్నీ పనిమనిషి చేస్తుంది. వంటా వార్పులు వంట మనిషిని పెట్టుకుంటే భేషుగ్గా చేస్తుంది. లేదా హోటళ్ళూ, క్యారేజీలూ వుండనే వున్నాయి. ఓ కుర్రాడిని పెట్టుకుంటే బడి నుంచి వచ్చిన పిల్లల్ని చూస్తాడు. రెండు పూటలా క్యారేజీలు తెస్తాడు. ఈ పాటిదానికి మీ ఇల్లాళ్ళు తెగ కష్టపడిపోతున్నట్టు పోజులు కొట్టే బదులు ఉద్యోగం చేస్తూ వేన్నీళ్ళకు చన్నీళ్ళలా అంతో ఇంతో సంపాదించి తోడు చేసి ఇస్తేనే మా మగాళ్ళకానందం" అన్నాడు.

"అయితే మరి ఈ బాధ్యతలూ, పనులూ ఎవరు చూస్తారు?"

"వీలుంటే మనమే! ఓపిక లేదనుకుంటే పని



వాళ్ళు!!" అంటూ తక్కున జవాబిచ్చాడు.

"మరి వారికి జీతాలివ్వాలిగా!" అమాయకంగా అడిగింది.

"ఇస్తాం. తెచ్చుకున్నప్పుడు ఇవ్వడానికేం భాగ్యం?"

"అలాగా" చిరునవ్వు నవ్వింది.

"అయితే ఉద్యోగంలో చేరతావా?" ఆశగా అడిగాడు.

"ఊ!" అంతకంటే ఆనందంగా అంది.

"నా పెళ్ళాం బంగారం. నా మనసెరిగి నడుచుకుంటుంది. అయితే రేపటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించు" అన్నాడు.

"సరే".

"నిజంగానా? లేక నన్నేడిపిస్తున్నావా?" అనుమానంగా అడిగాడు.

"మీ ఆనందమే నా ఆనందం".

సంతోషంగా దగ్గరకు తీసుకున్నాడు భార్యని.

*** *** ***

ముచ్చటగా మూడు నెలలు గడిచాయి జానకి ఉద్యోగంలో చేరి. ఆమె ఉద్యోగం చేస్తున్న ఆఫీసు చాలా దూరంలో వుంది. గంటన్నర ప్రయాణం. ఉదయం ఎనిమిది గంటలకే బయలుదేరాలి. సాయంత్రం ఆరుగంటలకే ఆఫీసు వదిలినా రద్దీగా వున్న బస్సులని పట్టుకుని ఎక్కి ఇంటికి వచ్చే సరికి ఎనిమిదో, ఎనిమిదిన్నరో అవుతోంది. సత్యం ఆరుగంటలకే వచ్చి ఇంటి బాధ్యత, క్యారేజీలు, పిల్లల బాధ్యతలూ చూసుకుంటున్నాడు.



ఆరోజు రాబడి ఖర్చుల పద్దు వేసి ఇచ్చింది జానకి. ఇద్దరి జీతం పిల్లల రోగాలకి, మందులకీ, డాక్టర్ ఫీజులకూ పని కుర్రాడికీ, బస్సు ఛార్జీలకూ, పనిమనిషికీ, క్యారేజీలకీ, పనిమనిషికి ఆయా డ్యూటీ చేస్తున్నందుకు అదనంగా ఇచ్చే జీతానికే ఎక్కువ పోతోంది. అన్నీ పోను మిగిలింది ఏమీ కన్పించడంలేదు ఆ మూడు నెలల నుంచి సత్యానికి. అదే సంగతి గురించి భార్యను అడిగాడు.

"నేను అదనంగా మూడు వేలు తెస్తున్నా ఖర్చులు, షోకులు, పిల్లల రోగాలు మింగేస్తున్నాయి. నేను మాత్రం ఏం చేయను చెప్పండి? నేనూ మీలాగే పొద్దంతా బయట కష్టపడి వస్తున్నాను. పైగా అంతంత దూరం ప్రయాణాలు! అవ్వా కావాలి, బువ్వా కావాలంటే కుదరదు కదా! ఎలాగో అడ్జెస్టయిపోవాలి ఉద్యోగస్తులన్నాక! ముఖ్యంగా మీ మురిపెం తీర్చటమే నా ధ్యేయం, నా ఆనందం, బాధ్యత కదా!"

"కానీ ఇదివరకులా మనం డబ్బు వస్తున్నా సుఖపడటం లేదెందుకని?" అడిగాడు సత్యం మధ్యలో అందుకుని.

" రాబడికి తగ్గట్టు ఖర్చులూ పెరుగుతాయి కదా! ఇంక సుఖం ఏముంటుంది? ఇద్దరం సంపాదించేస్తున్నామన్న అసూయను ఇతరులకు మిగల్చటం తప్ప!" అంది జానకి.

"కానీ జానకీ...సాఫీగా సాగే మన సంసారం ఎందుకో అస్తవ్యస్తంగా, అనీజీగా, భారంగా సాగుతున్నట్టనిపిస్తోంది. వస్తున్న డబ్బూ మిగలటం లేదు. లేని పోని ఖర్చులూ, కష్టాలూ కన్పిస్తున్నాయి" అంటుంటే భర్తకు నెమ్మదిగా జ్ఞానోదయం కలుగుతోందని గ్రహించిన జానకి మనసులో సంతోషిస్తూనే బయటపడకుండా—

"మనకేమండీ! ఇద్దరికీ కలిపి నెలకు ఎనిమిది వేలొస్తున్నాయి. ఎటొచ్చీ ఖర్చంటారా? నేను వంట చేస్తే వంటలో వేయి, పిల్లల్ని చూసుకుంటుంటే పని కుర్రాడికిచ్చే నాలుగు వందలూ, పనిమనిషికి ఇస్తున్న మాటయాభై, క్యారేజీ మీల్స్ ఖర్చులు, ఇకపోతే పాపం పిల్లలకు సంరక్షణ సరిగ్గా లేక రోగాలొస్తున్నాయి. అదో ఖర్చు. ఎలాగయినా పిల్లల్ని మనం చూసుకుంటున్నట్టు వాళ్ళు చూడరు కదండీ! అందుకే ఈ బాధలు తప్పవు. ఈ ఖర్చులూ తప్పవు. ఇల్లాలు ఈ పనులన్నీ చేసి బయట ఉద్యోగం చేయడం ఎంత కష్టమో మీకిప్పుడు అర్థమవుతోందనుకుంటాను" అని జానకి విశ్లేషిస్తూ చెప్పిన నిజాలకు సత్యం కన్విన్సయ్యాడు.

"మిలమిలా మెరిసిపోయే నువ్వు నలిగిపోయి పీలగా తయారయ్యావు. ఇల్లూ శుభ్రంగా లేదు. ఇదివరకటిలా సుఖంగా వుండలేకపోతున్నాము. పులిని చూసి నక్క వాతబెట్టుకుంటే ఏం జరుగుతుందో నా పనీ అంతే వుంది. పాత జీవితాన్ని కొనసాగించడమే బావుంటుందనిపిస్తోంది నాకు" అన్నాడు సత్యం.

"అంటే?" అర్థం కానట్టు అడిగింది.

"ఏముందీ ఈ నెల జీతం అందుకున్నావు కాబట్టి ఇక ఉద్యోగం మానెయ్యి".

"మీరే అంటున్నారా ఈ మాట!"

"అవును బుద్ధొచ్చింది. మరీ ఎంతో అవసరమైతే తప్ప ఇల్లాలు ఉద్యోగమంటూ బయటికి అడుగు పెట్టకూడదు. అలా జరిగితే ఇల్లు, సంసారం ఎంత అస్తవ్యస్తంగా తయారవుతాయో అనుభవం మీద తెలుసుకున్నాను. నాకు ఇది ఒక గుణపాఠం. నా కళ్ళు తెరిపించావు జానకీ! సమర్థత, తెలివి వున్న ఇల్లాలుకి సంపాదన అవసరం లేదు. పొదుపరితనంతో మిగిల్చి సొమ్ము చేయగలదు. నిన్నూ నీ మనసునీ కష్టపెట్టి వుంటే నన్ను క్షమించు జానకీ" అంటూ ఆమె రెండు చేతులూ పట్టుకున్నాడు సత్యం.

అతనిలో పశ్చాత్తాపానికి జానకి కరిగిపోయింది. ఇంత త్వరగా పరివర్తన వస్తుందని ఆమె ఊహించలేదు.

"మీకు కనువిప్పు కలగాలనే రాబడీ, ఖర్చులూ కూడా చూపించాను. పైసా ఆదాయం ఆశించకుండా ఆడది అన్నీ తానై పని చేస్తున్నా మీ మగాళ్ళు గుర్తించడం లేదు. ఏ సంపాదనా లేకుండా తింటూ కూర్చోవడమే కదా మీరు చేసేది అని ఆడిపోసుకుంటుంటారు. ఆడది చేసే ఇంటి చాకిరీకి వెల వుండదండీ! మీరిప్పటికైనా గుర్తించారు సంతోషం" అన్నది జానకి.

"అవును. నిజమే జానకీ. రోజంతా ఇంట్లో నువ్వు పడుతున్న శ్రమకు విలువ కట్టి ఇవ్వకపోవటం మాట అటుంచి కనీసం సానుభూతిగానైనా 'ఇంత పని ఒక్కదానివే ఎలా చేసుకుంటున్నావో?' అని ఒక్క సానుభూతి వాక్యం కూడా పలకకపోవటం నిజంగా తప్పే. అయినా నీ సేవలకు విలువ కట్టడం నా తరమా? నామటుకు నేను ఇంకెప్పుడూ నిన్ను బాధించను. సరేనా!" అంటూ దగ్గరకు తీసుకున్నాడు.

"మీలో మార్పొచ్చింది. అంతే చాలు" అంటూ జానకి ఇంకేం చెప్పవద్దన్నట్టు వారిస్తూ అతని పెదవులు మూసేసింది తన పెదవులతో